క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించే కార్యక్రమానికి 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలు మానవాభివృద్ధికి దోహదపడాలి



గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్ర, సాంకేతిక రంగాలు మానవాభివృద్ధికి దోహదపడాలని కేరళ సీఎం సాంకేతిక సలహాదారు, షార్ పూర్వ డైరెక్టర్ ఎంసీ దత్తు పేర్కొన్నారు. గుంటూరు నగరానికి చెందిన చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జి.శాంతమూర్తి, జి.పృథ్వీ రాజ్‌రెడ్డి, జయప్రకాష్ ఆదివారం కేరళ రాజధాని త్రివేండ్రంలో ఎంసీ దత్తును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా 13 ఏళ్ల క్రితం చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియాను శ్రీహరికోటలోని షార్ డైరెక్టర్‌గా ఉన్న ఎంసీ దత్తు ప్రారంభించారని, క్లబ్ వ్యవస్థాపకుడు శాంతమూర్తి తెలిపారు. ఈసందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను గురించి తెలుసుకున్న ఎంసీ దత్తు సంస్థ రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను ఆవిష్కరించినట్లు శాంతమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ కవయిత్రి డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎం.లలిత కుమారి నిర్వహణలో కవులు షేక్ ఖాసింబీ, పి.విజయశ్రీ, పి.దుర్గ, ఎస్ఎం సుభానీ, సయ్యద్ జానీబాషా, బి.జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, డి.అనిల్‌కుమార్, డాక్టర్ పి.బలరాం సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రస్తుతం సమాజంలో నెలకొన్న వివిధ అంశాలతో పాటు సమిధలమైనాంచాలు అక్షర సామ్రాజ్యం, గ్రంథశాల- పొత్తపుగుడి, మనీషి ఆలయం అనే అంశాలపై కవితలను వినిపించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారు సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాలకులు ఎన్.నాగిరెడ్డి, ఐవీ దుర్గారెడ్డి పాల్గొన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య మిత్ర వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా సేవాభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ రావు, ఆరోగ్య భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ రావు, జాతీయ సంఘటన కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ప్రాంత సంఘటన కార్యదర్శి కాకాని పృథ్వీరాజ్ పాల్గొని విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే విధానాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వర్క్‌షాప్‌లో ఆరోగ్య భారతి ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సీతారాం కిషోర్, డాక్టర్ కె.నాగార్జున, హిందూ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



లక్ష్మీపురం: ఆస్తమా ఉన్న వాళ్లకి గాలి ఎంత బలంగా ఊదుతున్నారు, అన్నదాన్ని బట్టి వాయు నాళాలు ఎలా ఉన్నాయో చెబుతారని, అలాగే మరికొన్ని టెస్ట్ కూడా ఉంటాయి అని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దగ్గు, ఆయాసం, ఉబ్బసం, పిల్లి కూతలు, క్షయ, నెమ్ము, గురక, నిద్రలేని సమస్యలు, అలర్జీ, వారసత్వంగా వచ్చే ఊపిరితిత్తుల ఇబ్బందులన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ వాటి లక్షణాలు అవి రాకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు అధునాతన వైద్య పద్ధతులపై పెద్దవారిలో వేయించుకోవలసిన టీకా గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర, కె.చంద్రశేఖర్, రామచంద్రరావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

కేఎస్ఎం షాపుల స్వాధీనంపై సందిగ్ధం

- లీజు గడువు పూర్తయి ఆరు నెలలు
- నోటీసుల పేరుతో కాలయాపన
- ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుయుక్తులు



కొల్లి శారదా మార్కెట్

నెహ్రూనగర్: గుంటూరు నగర నడిబోడ్డు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నగరపాలక సంస్థకు చెందిన డాక్టర్ కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్ ఉంది. దీని 25 సంవత్సరాల లీజు గడువు ఆరు నెలలు కిందట పూర్తి అయింది. ఇంత వరకు దుకాణాల స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. నోటీసుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువైన కార్పొరేషన్ ఆస్తి స్వాధీనం ప్రశ్నార్థకంగా మారిందనే చెప్పుకోవచ్చు.

లీజు గడువు పూర్తయి 6 నెలలు

1999లో కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్‌లో 88 షాపులను నగరపాలక సంస్థ నిర్మించింది. 25 ఏళ్ల లీజు గడువుతో షాపులను కొంత మంది దక్కించుకున్నారు. వీటి గడువు ఈ సంవత్సరం మే 31తో ముగిసింది. అయితే అప్పటి నుంచి షాపు నిర్వాహకులు...రెవెన్యూ అధికారుల మధ్య గేమ్ స్టార్ట్ అయింది. షాపులను స్వాధీనం కాకుండా రెవెన్యూ అధికారులు కుయుక్తులు పన్నుతున్నారనే చెప్పుకోవాలి. మూడు నెలలు ముందు ఇవ్వాల్సిన నోటీసులు గడువు తేదీ ముగుస్తుందనగా నోటీసులు జారీ చేయడంతో సదరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు దీనిపై స్టే విధించింది. మున్సిపల్ చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణంగా షాపులను స్వాధీనం చేసుకోవాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా 90 రోజుల కాలపరిమితితో షాపుల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నోటీసులకు సంబంధించిన కాలపరిమితి సెప్టెంబర్ 9తో పూర్తయింది. కాని ఇంత వరకు షాపులను స్వాధీనం చేసుకోలేదు... మళ్లీ 7 రోజుల నోటీసు పేరుతో కొత్త పాట పడటం రెవెన్యూ అధికారుల వంతైంది.

పేరుకుపోతున్న అద్దె బకాయిలు

కొల్లి శారదా మార్కెట్‌లో నెలకు 88 షాపులకు సుమారు రూ.8 లక్షలు అద్దె రూపంలో ఉంది. కాని మే నెల నుంచి అద్దెలు చెల్లించకపోవడంతో భారీ ఎత్తున అద్దెలు పేరుకుపోతున్నాయి. రూ.కోటి వరకు అద్దె బకాయిలు ఉన్నాయి. వసూలు చేయడానికి రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. వీటిని స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం నిర్వహిస్తే కోట్లల్లో ఆదాయం వస్తుంది.

> **షాపుల స్వాధీనానికి చర్యలు తీసుకుంటాం**
>
> డాక్టర్ కొల్లి శారదా మార్కెట్‌లోని షాపుల స్వాధీనానికి చర్యలు తీసుకుంటున్నాం. ఏడు రోజుల నోటిసులు జారీ చేశాం. వారిని అక్కడ నుంచి ఖాళీ చేయించి షాపులను స్వాధీనం చేసుకుంటాం
>
> – డి.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్

త్వరలోనే స్ట్రీట్ వెండింగ్ జోన్లు ఏర్పాటు

కమిషనర్ శ్రీనివాసులు



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వాస్తవంగా వీధి వ్యాపారం చేసుకునే వారికి అండగా ఉంటామని, వారికి త్వరలోనే స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కమిషనర్ అమరావతి రోడ్ లో పలు ప్రాంతాల్లో వీధి వ్యాపారులను అనుగుణంగా స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారాల పేరుతో రోడ్లు, డ్రెయిన్లు ఆక్రమణ చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించడానికి వీలు లేదన్నారు. అమరావతి రోడ్‌లో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతాలను పట్టణ ప్రణాళిక అధికారులు సర్వే చేసి, ఆయా ప్రాంతాల్లో ఎన్ని బండ్లు ఏర్పాటు చేయవచ్చు, పార్కింగ్‌లను పరిశీలించి సోమవారానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్‌పై ప్రతి ఐదు అడుగులకు ఒక మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వీధి వ్యాపారులతో కమిషనర్ మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు చేయనున్న వెండింగ్ జోన్‌లో స్థల కేటాయింపు చేస్తామన్నారు. రోడ్ల మీద, డ్రెయిన్ల మీద అడ్డుగా వ్యాపారులు బండ్లు ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్.బాలాజీ, ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, ఎస్ఎస్ సోమ శేఖర్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వెండింగ్ అసోసియేషన్ నాయకులు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సీపీఆర్ ఎలా చేయాలో వివరిస్తున్న డాక్టర్ పీఎస్ రావు

గుంటూరు మెడికల్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని యోగి భవన్‌లో విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై వర్క్‌షాపు ఆదివారం నిర్వహించారు. హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలనే విషయాలపై డాక్టర్ పీఎస్ రావు వివరించారు. విద్యార్థులతో సీపీఆర్ చేయించి చూపించారు. ప్రథమ చికిత్స గురించి పేషెంట్ గాయపడిన తర్వాత హాస్పిటల్‌కి చేరే లోపల ప్రాణాన్ని ఎలా కాపాడాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య జీవనశైలి ఎలా ఉండాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, మానసికంగా ఎలా ఉండాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి, హోమియో వైద్యంలో 12 రకాల హోమియో మందులను సాధారణ జబ్బులకు ఎలా వాడుకోవాలో వివరించారు. డాక్టర్ సీతారామ కిషోర్, మన వంట ఇంటిలో ఉండే వంట దినుసులతో వాతావరణ మార్పిడి ద్వారా, వచ్చిన ఇబ్బందులకు ఎలా చికిత్స చేసుకోవాలో వివరించారు. రాబోయే రోజులలో ప్రతినెల ఎంపిక చేసిన పది పాఠశాలల్లో ప్రథమ చికిత్స, ఇంటి వైద్యం, హోమియో వైద్యంపై అవగాహన కల్పిస్తామని డాక్టర్ కాకాని పృథ్వి రాజు వెల్లడించారు. డాక్టర్ కల్లగంటి నాగార్జున మాట్లాడుతూ షుగర్ వ్యాధి రాకుండా చేసే ప్రయత్నం పలు మాధ్యమాల ద్వారా చేయాలన్నారు. చాలామంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని, కేవలం ఆరోగ్య జీవనశైలి ద్వారా మాత్రమే దీనిని అరికట్టగలమని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ కేఎస్ఎన్ చారి, ఆరోగ్యభారతి రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ సీతారాం కిషోర్, గుంటూరు హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్మెంట్ ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్మెంట్ విద్యార్థులు, సుమేధ స్కూల్, పట్టాభిపురం హైస్కూల్ ,పెరల్స్ హైస్కూల్, వీఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, హైమారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు పేర్కొన్నారు. కొత్తపేటలోని జలగం రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నగర శాఖ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ జీవో 84ను రద్దు చేసి, అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు గ్రేడ్-2 హెచ్‌ఎంతోపాటు అన్ని సబ్జెక్టుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నగర శాఖ కార్యవర్గం ఎన్నిక

నగర శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఎన్.వేణుగోపాలరావు, అధ్యక్షునిగా పి.సాయివిశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా పి.లలితబాబు, ఆర్థిక కార్యదర్శిగా కేవీ రాఘవులు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వర్లు, వై.రత్నశ్రీ, ఎస్.నాగరాజుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, ఏపీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: చదువుకు పేదరికం అడ్డుకాకూడదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు చంద్రమౌళి నగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరుగుతున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఓరియంటేషన్ కార్యకమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిభగల పేద విద్యార్థులకు ఆర్థికంగా సహాయం చేయటానికి అనేక సంస్థలు, వ్యక్తులు సిద్ధంగా ఉన్నారని కాబట్టి పేదరికం ఉన్నత స్థానాలకు చేరేందుకు అడ్డుకాదని ప్రతి ఒక్కరూ కష్టపడి, ఇష్టంతో చదివితే జీవితంలో ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక ప్రణాళిక ప్రకారం సమయాన్ని సద్వినియోగం చేసుకొని జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని దానికి అనుగుణంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మానవతా సంస్థ అందిస్తున్న శిక్షణను ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో నేర్చుకొని, మోడల్ టెస్ట్ పేపర్లు ప్రతిరోజు ప్రాక్టీస్ చేసి అత్యధిక మార్కులు సంపాదించి స్కాలర్ షిప్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.సతీష్, శివాజీ, ధనుంజయరెడ్డి, రాధాకృష్ణ, అరుణాచలం, రమణ, విజయలక్ష్మీ, అధ్యాపకులు ప్రకాష్, మంగారావు, రెహమాన్, శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మధుమేహ బాధితులలో మెదడు, నరాల సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ పి.నటరాజ

గుంటూరు మెడికల్: మధుమేహం, శరీరంలోని ఏ ఒక్క అవయవాన్ని వదిలిపెట్టదని, ప్రతి అవయవంపై ప్రభావం చూపి వాటి అంతర్నిర్మాణంలో, పనితీరులో మార్పులకు దారితీస్తుందని న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.నటరాజ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్.హెచ్.ఓ. సమావేశ మందిరంలో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా 'మధుమేహ బాధితులలో మెదడు- నరాల సమస్యల'పై అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సభకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ నటరాజ మాట్లాడుతూ దీర్ఘ కాల మధుమేహ బాధితుల్లో రక్తంలో అధిక శాతం షుగర్ ఉండటం వల్ల మెదడు, నరాలు అనేక విధాలుగా ప్రభావితం అవుతాయన్నారు. అటనామిక్ న్యూరోపతిలో శరీరంలోని అవయవాలను ప్రభావితం చేసే నాడులలో అసాధారణ మార్పులు వస్తాయని తెలిపారు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ మధుమేహ బాధితులు మెదడు నరాల సమస్యలను ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్.హెచ్.ఓ. మేనేజర్ పి.నిర్మల రాణి, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మారెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి కే సతీష్, సభ్యులు వి.సుబ్రహ్మణ్యం, ఎం.సాంబశివరావు, సిహెచ్.శివాజీ, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


ఇళ్ల స్థలాల కోసం వినతిపత్రాలు అందించాలి

లక్ష్మీపురం: ఇళ్ల స్థలాల మంజూరు కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రాల అందజేత కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి కోరారు. స్థానిక 26వ డివిజన్ చంద్ర రాజేశ్వర రావు నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి నివాస దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఎన్నికల వాగ్దానంలో భాగంగా చంద్రబాబు నాయుడు పట్టణంలో రెండు సెంట్లు, పల్లెలలో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు ఎం.దేవా నాయక్, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి

గుంటూరు మెడికల్: రూరల్ మండలంలో బీజేపీని బలోపేతం చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవిఠల్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని పార్టీ కార్యాలయంలో గుంటూరు రూరల్ మండలం అధ్యక్షుడు కంచర్ల రాజేష్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2024 సంవత్సరంలో పార్టీ సాధారణ సభ్యత్వాలు, క్రియాశీల సభ్యత్వంపై చర్చించారు. సమావేశంలో పార్టీ నేతలు కన్నా రవి దేవరాజు, డి.శ్రీనివాసరావు, బి.నాగిరెడ్డి, ఎం.తరుణ్ పాల్గొన్నారు.

పత్రీజ్ స్మారక సేవా పురస్కారాలు ప్రదానం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బ్రహ్మర్షి పితామహ పత్రీజ్ గారి స్మారక సేవా పురస్కారాల సభ నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు నాట్యచార్య మట్టుపల్లి కాశీవిశ్వనాథ్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి సేవా పురస్కారాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి నిర్వాహకులు కాజా వెంకటసుబ్రహ్మణ్యం, కళారత్న, గాన కళానిధి మోదుమూడి సుధాకర్, అంజనా, వైద్యులు గుంటూరు వరుణ్, ఆచార్యులు పెచ్చెట్టి వరప్రసాద్‌మూర్తి, వసుదైక ఫౌండేషన్ చైర్మన్ నాగేంద్రం పేరం, నృత్యాంజలి మ్యూజిక్, డాన్స్ అకాడమి నిర్వాహకులు(కాకినాడ) హరి లోకేష్‌శర్మను పురస్కారాలతో సత్కరించారు.

వివిధ గ్రంథాలయాల్లో పోటీలు



గార్డెన్స్ గ్రంథాలయంలో హాజరైన విద్యార్థులు



ఎస్వీఎన్ కాలనీలోని గ్రంథాలయంలో కథల పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు డి.కృష్ణమూర్తి, సీహెచ్ సురేందర్‌రెడ్డి, చార్టర్డ అకౌంటెంట్ ఎం.విశాల్‌కుమార్, గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్యశిరీష, సిబ్బంది పి.కోటేశ్వరి, పి.సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

–ప్రాంతీయ గ్రంథాలయంలో..

'విద్యాభివృద్ధి–గ్రంథాలయాలపాత్ర', సీపీ బ్రౌన్ – తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషి అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

–ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో కథల పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ ఉపాధ్యాయుడు నాగార్జున, గ్రంథాలయ సభ్యులు, రికార్డ్ అసిస్టెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

అందరూ సంఘటితంగా పనిచేయాలి



నగరంపాలెం: అందరూ సంఘటితంగా పని చేయాలని బ్రాహ్మణ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సేవాసమితి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు జె.పార్థసారథి అన్నారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈనెల 24న సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్న కార్తిక దీపోత్సవానికి హిందూ బంధువులు హాజరవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణ, కార్యదర్శి పి.నాగశివన్నారాయణ, సభ్యులు ఐవీ శ్రీనివాస్, బి.మల్లికార్జునశర్మ, జీవీఎల్ నరసింహారావు, జి.హేమలత, ఆర్.హనుమాయమ్మ, జి.వేణుగోపాల్ రావు, పి.గౌరీనాథ్, ఫణికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు.


స్త్రీల పాటలు పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై అజో–విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత నృత్య, నాటక, సాహిత్య సంస్థ సంయుక్తంగా నందిరాజు చలపతిరావు రచించిన స్త్రీల పాటలు పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. సభకు ప్రముఖ రంగస్థల సినీ నటుడు, రచయిత దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు వేమూరి రామలక్ష్మి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి గ్రంథ పరిచయం చేశారు. సభలో ద్రవిడ విశ్వ విద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ తోట వెంకటస్వామి, అజో–విభో కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, సంస్కృతి నిర్వాహకులు సత్రాజు బాలచందర్ హాజరై, రచయిత నందిరాజు చలపతిరావును సత్కరించారు.



స్వామి వారికి ప్రత్యేక పూజలు



వ్రతాలలో పాల్గొన్న దంపతులు

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

స్థానిక మారుతినగర్‌లోని శ్రీకంచి కామకోటిపీఠ శ్రీమారుతి దేవాలయ ప్రాంగణంలో కార్తిక మాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సుమారు 120 మంది దంపతులు హాజరై, సత్యనారాయణస్వామి వ్రతాలు చేపట్టారు. భక్తుల అందరికి అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. తొలుత స్వామికి మాన్యాస ఏకాదశి రుద్రాభిషేకాలు ప్రదోషకాలంలో సహస్ర మృతిక లింగార్చన కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించారు. హారతి మంత్రపుష్పాలు ఇచ్చి ప్రసాద వితరణ చేశారు.

–నగరంపాలెం